■ షణ్ముఖశ్రీ

# కాపురం

"ఎనిమిది గంటలకే రమ్మని ఏర్పాటు చేసుకున్న బస్సు పది గంటలయినా రాలేదు." విసుక్కుంటూ ఇంటి ముందే తారట్లాడుతున్నారు రామారావుగారు.

"అన్నింటికీ అంత విసుగైతే ఎలాగండీ! కాస్త ఓర్చుకోవాలి." వాకిట్లోకొచ్చిన జానకమ్మ సర్ది చెప్పింది.

"పిల్లవాడి చేత ఆ పిల్లకు మూడు ముళ్ళూ వేయించి ఇంటికి తెచ్చేదాకా టెన్షనేనే" అన్నారాయన.

"బాగుంది వరస!" ముఖం చిట్లించింది.

"వాట్ డాడీ! ఎందుకలా ఇదయిపోతారు. నా ఫ్రెండ్ చలపతే వెళ్ళాడు బస్సు తేవడానికి." ఊరడించబోయాడు శేఖర్.

"నాకేమన్నా సరదానా! నా భయాలు నావి. నీ పెళ్ళి గురించి ఎన్ని సంబంధాలు చూశాను. ఎంత మందికి జాతకాలు చూపించాను. ఎందుకో తెలుసా? నీ జాతకరీత్యా నీ పెళ్ళి కావడం అంత సామాన్యమైన విషయం కాదు. సప్తమాధిపతి, లగ్నాధిపతికి దూరంలో ఉన్నాడు. పైగా కుజదోషం కూడానూ!" తన బాధను సూటిగా చెప్పారు.

"అన్నింటికీ ఒకటే తొందర! ఇంకొన్నాళ్ళాగితే ఎక్కువ కట్నంతో, ఏ పట్నం పిల్లో వచ్చుండేది. వద్దన్నా వినకుండా పల్లెటూరి సంబంధం ఖాయం చేశారు. జాతకాలు కుదరంగానే సరిపోయిందా! ఏదో చదివానంది. ఏం చదివిందో, ఏం పేలాలేగిస్తుందో!" తన బాధనూ వెళ్ళగక్కింది.

ఇంతలో 'పెండ్లివారమండి' అన్న బోర్డుతో బస్సు వచ్చి వాకిట్లో ఆగింది. ఆదరాబాదరాగా పెండ్లి పెట్టెతో శేఖర్, అతని చెల్లెలు కమల, జానకమ్మగారు, రామారావుగారు బస్సు ఆగీఆగకుండానే ఎక్కేశారు. ఆ తరువాత సామానుతో వచ్చిన బంధువర్గమంతా ముందు సీట్ల కోసం పోటీపడి చిన్న సైజు తొక్కిసలాటతో బస్సులోకి జొరపడ్డారు. ఒక ముత్తయిదువ బస్సుకు కొబ్బరికాయతో హారతిచ్చి పగులగొట్టింది. బస్సు కదిలింది. అందరూ ఉత్సాహంగా, గోలగోలగా ఎవరి కబుర్లలో వారు పడ్డారు. బస్సు మెల్లగా ఊరి పొలిమేరలు దాటి మెయిన్ రోడ్డులోకి దూసుకుంటూ వెళ్తోంది.

రామారావుగారికి కుడివక్కనే ఆయన బావమరిది సత్యం కూర్చున్నాడు. బస్సు అంతకంతకూ వేగం పుంజుకుంటోంది.

"మరీ అంత స్పీడెందుకో!" సంభాషణ కదిపారు సత్యంతో.

"అసలు డ్రైవర్ ఏదో పనిమీద వెళ్తేనూ, ఎవరూ దొరక్క ఈ లారీ డ్రైవర్ని బతిమాలి తీసుకొచ్చాట్ట మీ అబ్బాయి స్నేహితుడు చలపతి." తనకు తెలిసిన విషయం చెప్పాడు సత్యం.

లారీ డ్రైవరే తమ బస్సు డ్రైవరని తెలిసినప్పట్నుంచీ రామారావుగారి మనసు అల్లకల్లోలం అయిపోయింది. సాధారణంగా కొందరు లారీ డ్రైవర్స్ బాగా తాగి డ్రైవ్ చేస్తుంటారని ఎవరో అనగా విన్నాడు. ఆ మాట గుర్తొచ్చినప్పట్నుంచీ, ఎక్కడన్నా సడన్ బ్రేక్ పడి బస్సు భూకంపంలా ఊగినప్పుడు, "ఇదుగో డ్రైవరుగారూ! మీ పేరేమిటో... కొంచెం మెల్లగానే పోనియ్యండి. ముహూర్తానికి చాలా టైముంది. కంగారేం లేదు" అంటూ హెచ్చరికలు చేయసాగారు.

అయినా, ఆ డ్రైవర్ తన సహజ నైపుణ్యంతోనే, ఆ బస్సును కూడా లారీ అన్న భ్రమతోనే స్పీడుగా పోనివ్వసాగాడు. దాంతో మంచినీళ్ళు పట్టిన చిన్న డ్రమ్ము దొర్లి నీళ్ళన్నీ ఒలికాయి. ఇతర సామాన్ల సంగతి సరేసరి. రణగొణధ్వనుల మధ్య చిందరవందరవుతున్నాయ్. బంధువులంతా విసుక్కుంటూ తమ తమ సామాన్లను సరిగా ఉంచుకోవడాలు, మండిపడడాలు ఎక్కువైనయ్.

రామారావుగారు మాత్రం ఎన్నిసార్లని చెప్పగలరు? ఏం చేయాలో పాలుపోక సగం సగం వచ్చిన స్తోత్రాలు చదువుకోసాగారు- మరీ ఎక్కువగా భయపడినట్లు తెలిస్తే తన భార్య జానకమ్మ చాలా అవమానంగా ఫీలయి బస్సులోంచి కిందికి దూకుతుందేమోనని భయపడి. ఆవిడకు పిరికిపందలంటే అసలు గిట్టదు. రామారావుగారి చేష్టల్ని మొదట్నుంచీ గమనిస్తున్న జానకమ్మ నలుగురి ముందూ అరుచుకోవడాలు బాగుండదని కూతురు కమలతో కబుర్లలో పడింది. ఆడపడుచు అంటే ఎలా ఉండాలి? అన్నయ్య పెళ్ళిలో ఎలా అలగాలి! ఎలా ఎలా గొడవ చేస్తే ఆడపడుచు అలకలు తీరేదీ బోధిస్తోంది. కమలకు పధ్నాలుగేళ్ళున్నాయి.

ఆ అమ్మాయి అంతా విని వాళ్ళమ్మను ఎదురు ప్రశ్న వేసింది- "మమ్మీ! మరి నా పెళ్ళికి కూడా నాలాంటి ఆడపడుచు అల్లరి చేస్తే నువ్వేం చేస్తావ్" అని.

"చూడు కమలా! నీకు మాత్రం అత్తమామలు గానీ, ఆడపడుచులు గానీ ఎవరూ ఉండరు. సినిమాలో హీరోలా ఏకో నారాయణలా పెళ్ళికొడుకు మాత్రమే ఉంటాడు. అలాంటి సంబంధమైతేనే ఒప్పుకుంటాను. సరేనా" అంది గంభీరంగా జానకమ్మ.

"అప్పుడు ఇలాంటి బస్సు రాదన్నమాట!" చిన్నబుచ్చుకుంది కమల.

"ఆపండి మీగోల." బస్సు వేగానికి తోడు వీళ్ళ సంభాషణలు కూడా రామారావుగారికి చిరాకు పుట్టిస్తున్నాయ్. అందుకే అలా అరిచారాయన.

బస్సు ఆగింది. "టీలూ, కాఫీలు, ఇతర అవసరాలు తీర్చుకోండి. ఓ అరగంటలో మళ్ళీ బయల్దేరుదాం" అంటూ డ్రైవర్ బస్సు దిగాడు.

రిలాక్స్ కావడానికి దాదాపుగా అందరూ బస్సు దిగారు. రామారావుగారికి కాస్త ప్రాణం హాయనిపించింది. కొద్దిసేపటి తరువాత ఒక్కొక్కరే బస్సు తిరిగి ఎక్కడం ఆరంభించారు. అందరూ ఎక్కారు గానీ డ్రైవర్ జాడ తెలియలేదు.

"నా దగ్గర వందకాగితం పుచ్చుకొని వెళ్ళాడు." చలపతి చెప్పాడు.

"నువ్వెందుకిచ్చావ్! ఆ బస్సు కాంట్రాక్టర్ ఇచ్చుకుంటాడుగా!" అడిగారు రామారావుగారు.


"అతని దగ్గర బొత్తిగా లేవుట. కాంట్రాక్టర్ తిరిగి మనల్ని ఇక్కడకు చేర్చాక గాని ఇవ్వడట. ఏదో దారి ఖర్చులకంటే ఇచ్చాను." గొణిగాడు చలపతి.

ఇంతలోనే డ్రైవర్ కొంచెం దూరంలో ఉన్న పాకలోంచి మెల్లమెల్లగా వచ్చి డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. బస్సు కదిలింది. తిరిగి రామారావుగారికి డ్రైవర్ని గురించిన బెంగ ఆరంభమైంది. 'ఆ డబ్బుతో అతను ఆ పాకలో బాగా తాగేసి ఉంటాడు. సందేహం లేదు' అని అనుకోసాగారు. ఇంతలో ఒక్కసారిగా సడన్ బ్రేక్ పడింది. బస్సులోని వాళ్ళంతా ఒకళ్ళ మీద ఒకళ్ళు పడ్డారు. అందరూ తేరుకొని, సర్దుకొని చూసేసరికి బస్సు హెడ్‌లైట్స్‌లో ఎదురుగా రోడ్డుకడ్డంగా పెద్ద పెద్ద రాళ్ళున్నాయ్. డ్రైవర్ స్టీరింగ్ మీద వాలిపోయాడు. శేఖర్, చలపతి దగ్గరకెళ్ళి చూడగా తాగిన వాసన వచ్చింది. డ్రైవర్ మత్తులోకి జారుకున్నాడు. అందరూ ఎలా ఎలా అని అనుకుంటుండగానే నల్ల ముసుగులతో నలుగురు కత్తులూ కటార్లతో బస్సు దగ్గరికి వచ్చారు.

"తలుపు తెరవండి! అందరూ దిగిరండి" అంటూ దౌర్జన్యంగా అరిచాడొకడు.

రామారావుగారికి పై ప్రాణం పైనే పోయింది. నోట మాట రాలేదు.

"ఊఁ, త్వరగా!" మరొకడు క్రూరంగా అన్నాడు.



"చంపేస్తాం! తియ్యండి తలుపు." ఇంకొకడు మరింత కర్కశంగా అన్నాడు. శేఖర్, చలపతి, ఇంకా ఒకరిద్దరు కుర్రాళ్ళు ధైర్యం తెచ్చుకొని తలుపు తీశారు.

"ఊఁ, దిగండందరూ!" మొదటివాడు అన్నాడు.

కొందరు సామాను చేత పుచ్చుకొని దిగుతుండగా, "సామాను అక్కడే ఉంచండి!" గద్దించాడొక ముసుగువాడు.

భయంతో వణకుతున్న కాళ్ళతో ఆ బంధుమిత్ర

సపరివారమంతా 'పెండ్లివారమండీ! దయతల్చండీ' అన్నట్లుగా సవినయంగా కిందికి దిగారు.


"ఆడవాళ్ళు నగలూ, మొగవాళ్ళు డబ్బూ తీసి ఇచ్చేయండి. కమాన్ క్విక్" అంటూ కత్తి చూపిస్తూ అన్నాడొకడు. అంతా ఒక్కొక్కరే తీసి ఇవ్వబోతుండగా రెండు పక్కల నుంచీ ఏవో వాహనాల హెడ్ లైట్స్ పడడంతో వాళ్ళు కంగారుగా ఆ పక్కనే ఉన్న పొదలవైపుకు పారిపోయారు. వీళ్ళందరూ హడావిడిగా దారికడ్డంగా ఉన్న రాళ్ళను తీసిపడేసి తిరిగి బస్సెక్కారు.

ఎక్కారే గానీ డ్రైవర్ మత్తుగా నిద్రపోతున్నాడు. ఎవరికీ ఏం చేయాలో పాలుపోలేదు. శేఖర్, చలపతి, ఇంకా మిగిలిన కుర్రవాళ్ళు డ్రైవర్‌ను లేపడానికి ప్రయత్నించారు. ఎలానో డ్రైవర్ ఈ లోకంలోకి రాగలిగాడు. అతని మొహాన నీళ్ళు కొట్టి, మంచి మాటలు చెప్పి, నిమ్మకాయ నీళ్ళిచ్చి, మజ్జిగ తెచ్చి ఇప్పించి, బతిమాలి, బామాలి ఎలాగోలా అతన్ని ఆర్డర్లో పెట్టేసరికి తాతలు దిగొచ్చారు. డ్రైవర్ ఒకసారి కిందికి దిగెళ్తానన్నా వెళ్ళనీయకుండా జరిగింది చెప్పి తొందర చేశారు. డ్రైవర్‌కు ఊపొచ్చి ఏకబిగిన బస్సును స్టార్టు చేసి వదిలాడు. బస్సు ఆకాశంలో ఎగురుతున్నట్లుగా పోసాగింది. ఈసారి మాత్రం రామారావుగారు బస్సు డ్రైవర్ని అదుపులో పెట్టడానికి ప్రయత్నించలేదు. ఎంత త్వరగా ఆ పల్లెకు పోయి, ఆ కార్యక్రమాన్ని పూర్తిచేసుకొని వచ్చేద్దామా అన్న ఆలోచనలతో ఎన్ని కుదుపులనైనా భరిస్తూ కూర్చోగలిగారు. బంధుమిత్రసపరివారమంతా కంటిమీద కునుకు లేక, చిమ్మచీకటిలో చీమ చిటుక్కుమన్నా ఉలిక్కిపడుతూ, 'లేనిపోనిది ఎందుకు బయల్దేరాముర భగవంతుడా' అని అనుకొంటూ ఎవరూ ఎవరితోనూ మాట్లాడకుండా ఎవరి ఆలోచనలలో వాళ్ళు మునిగిపోయారు.

*   *   *

ఉదయం 7 గంటలు కావస్తుండగా బస్సు పల్లె చేరింది. పెళ్ళివార్ని విడిదికి తీసుకుపోవడానికి సన్నాయి మేళం బస్సు దగ్గరకు చేరింది. కొందరు ముత్తయిదువులతో పెళ్ళికూతురు తండ్రి బస్సు దిగిన శేఖర్ మెళ్ళో దండ వేసి, ముత్తయిదువ హారతి ఇవ్వగా, ఆ పెళ్ళి పరివారాన్ని విడిదికి ఆహ్వానించి తీసుకువెళ్ళారు. కాలకృత్యాలు, టిఫిన్, కాఫీలు పూర్తయ్యాక, విడిదిలోకి విచ్చేసిన వియ్యాలవారితో రామారావుగారి భార్య జానకమ్మ తన కూతురు కమలతో కలిసి ఓ పెద్ద కొయ్యకుర్చీలో కూర్చుని

చిత్రాలు: నర్సిం



నల్ల ముసుగులతో నలుగురు కత్తులూ కటార్లతో బస్సు దగ్గరికి వచ్చారు. "తలుపు తెరవండి! అందరూ దిగిరండి" అంటూ దౌర్జన్యంగా అరిచాడొకడు. రామారావుగారికి పై ప్రాణం పైనే పోయింది. నోట మాట రాలేదు.

రాత్రి జరిగిన సంఘటనలు గుర్చి చెబుతూ, "చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయింది" అన్నది ఏడుపూ నవ్వూ కాని ముఖంతో. ఆడపెళ్ళివారంతా ఆ విషయం విని తల్లడిల్లిపోయారు. ఎవరిలోనూ ఏవిధమైన సరదా కనిపించలేదు. అందరూ మెకానికల్‌గా ఎవరి పని వారు చేసుకుపోతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెళ్ళికూతురు పద్మ పెద్దగా ఆశ్చర్యపోలేదు. 'ఇవి ఈనాడు జరగకపోతే ఆశ్చర్యపోవాలి' అని అనుకుంటూ నిబ్బరంగా ఉంది.

"అమ్మా! ఇంకో స్ట్రాంగ్ కాఫీ తెప్పించండి" అని అక్కడివాళ్ళను పురమాయించి, "మా వాడు" అని ఆపి, "ఆ మాట నేనంటే బాగోదు. పైగా దిష్టి తగుల్తుంది కూడా. అచ్చు సినిమా హీరోలా వాళ్ళతో ఫైట్ చేద్దామనుకున్నాడు. ఆ అవసరం లేకుండానే వాళ్ళు వెళ్ళిపోయారు" అని చెప్తుండగా వచ్చిన కాఫీని తీసుకొని తాగడం మొదలెట్టింది జానకమ్మ.

సినిమా హీరోలా అన్న ఆమె మాటను అక్కడున్న ఆడంగులు గబగబా వెళ్ళి పెళ్ళికూతురు పద్మ చెవిలో వేశారు. ఆది నుంచి పల్లె వాతావరణానికి అలవాటు పడినా, కొద్దిగా చదువుకున్నదీ, నేటి ప్రాపంచిక విషయాలమీద అవగాహన కలిగినది కావడం వలన ఈ పట్నవాసపు గొప్పలు చెప్పుకోవడానికి ఇంత కన్నా గొప్పగా ఉండవులే అనుకుంది.

పెళ్ళిపెద్దలూ, పురోహితుడూ, సంబంధం కుదిర్చిన మధ్యవర్తి, పెళ్ళికుమార్తె తల్లి తండ్రులు- అందరూ గుంపుగా అక్కడ గుమికూడి రామారావుగార్ని పరామర్శించడం మొదలెట్టారు. ఆయనకు ఇవన్నీ పట్టలేదు. తొందరగా ఆ పెళ్ళి ముగించుకొని ఎప్పుడెప్పుడు వెళ్ళి కొంపలో పడదామా అని ఉంది. అందుకే ఓ మూల పడుకొనున్నారు.

"ఏవో కొన్ని భగవంతుని పరీక్షలా జరుగుతుంటయ్. ముహర్తబలం గొప్పది కనుక బయట పడ్డారు. అన్నీ హాయిగానే జరిగిపోతయ్. లేవండి రామారావుగారూ! స్నాతకం వగైరాలు జరిపించుకోండి" అంటూ పురోహితుడు హితవు చెప్పాడు.

రామారావుగారు లేని ఓపిక తెచ్చుకొని లేచారు. ఆ తరువాత జరగవలసిన కార్యక్రమాలన్నీ వెంటవెంటనే జరిగిపోయాయి. కల్యాణవేదికలో వేదోక్తంగా, మంగళవాద్యాల మధ్య శేఖర్, పద్మ మెళ్ళో మూడు ముళ్ళూ వేశాడు. విందులూ, వినోదాల అనంతరం అలకలు, అంపకాలు ఆరంభమయ్యాయి. జానకమ్మ కూతురు కమలను అలకపాన్పు ఎక్కించాలనుకుంది. కానీ, బంధువుల్లో ఉన్న భయాందోళనలు, రామారావుగారి హడావిడి చూసి ఆ ప్రయత్నం విరమించుకుంది. అన్నీ ప్రశాంతంగా ముగిశాయి. పెళ్ళికుమార్తెతో పాటు కొన్ని పిండివంటలు, సామానుతో కూడా ఆమె అన్నావదినెలు బస్సెక్కారు. మిగతా అందరూ బస్సు ఎక్కారో, లేదో చూసుకున్న తరువాత రామారావుగారు తృప్తిగా బస్సెక్కారు.

ఈసారి ఆ ఊళ్ళోనే ఉన్న మంచి డ్రైవర్‌ను, అంటే మందూ మాకూ అలవాటు లేనివాణ్ణి, ముందు చూపున్నవాణ్ణి ఏర్పాటు చేశారు రామారావుగారి వియ్యంకుడుగారు. ఎంతో నిదానంగా ఉన్నాడు. బస్సును కూడా నిదానంగా నడిపేలా ఉన్నాడు. ఏమైనా రామారావుగారికి తిరుగు ప్రయాణంలో కాస్తంత ప్రశాంతత లభించినట్లే లెక్క.

బస్సు కదిలి పట్నం రోడ్డెక్కింది. శేఖర్, పద్మలు పక్కపక్కనే కూర్చున్నారు. శేఖర్ అక్కడి నుంచి వచ్చేటప్పటి విశేషాలు చెబుతున్నాడు. పద్మ 'ఊఁ' కొడుతోంది. రాత్రి కావడం వలన, అందరూ బాగా అలిసి ఉన్నందున అంతా నిద్రలోకి జారుకున్నారు.

బస్సు ఊరు సమీపించడానికి రెండు కిలోమీటర్లు ఉందనగా కేకలు, అరుపులు, రాళ్ళు రువ్వడాలు. ఏదో విధ్వంసకాండ జరుగుతున్న దృశ్యం. అందరూ ఒక్క ఉదుటున లేచారు. డ్రైవర్ బస్సును రోడ్డు

సైడుగా ఉన్న చెట్ల మధ్య ఖాళీ లోంచి పక్కకు పోనిచ్చి అక్కడ ఆపాడు. ఆ బస్సుకు కూడా వెనుక వైపు రాళ్ళు వచ్చి కొట్టుకొని అద్దం పగిలింది. రామారావుగారికి చెమటలు పట్టాయి. ఎవరినీ దిగొద్దన్నాడు డ్రైవర్. దాదాపుగా ఆ ప్రాంతమంతా ఉద్రిక్తమైంది.

ఏం జరిగిందో! ఏం జరుగుతోందో! అందరిలోనూ ఇదే ఆరాటం.

"ఏమయ్యుంటుందంటారు?" అడిగాడు పురోహితుడు పెళ్ళి పెద్దను.

"ఏమౌతుంది? ఏదో జరగకూడనిదే జరిగుంటుంది" అన్నాడాయన.

"పార్టీల గొడవలేమో!" మళ్ళీ పురోహితుడు అందుకున్నాడు.

"పాలిటిక్సులంటేనే నాకు మహ చెడ్డకోపం." పెండ్లి పెద్ద.

"నాకూ అంతేనండీ! తిన్నగా ఉన్నవాళ్ళు తిన్నగా ఉండరు. తన్నుకు చస్తుంటారు. వాడు తిన్నాడని వీడు, వీడు తిన్నాడని వాడు. మధ్యలో మనుషుల్ని చంపుకుతింటున్నారనుకోండి." పురోహితుడు.

ఇలా వాళ్ళ సంభాషణ సాగుతుండగానే కొందరు దుండగులు ఆగి ఉన్న బస్సు దగ్గరకు రావడాన్ని గమనించిన డ్రైవర్ తాను బస్సు దిగుతూ, అందర్నీ బస్సు దిగి వెళ్ళమని చెప్పాడు. ప్రాణభయంతో అందరూ పరుగున పోయి, ఆ ప్రాంతాల్లో ఉన్న పొదల మాటున తలో చోట తల దాచుకున్నారు. వాళ్ళందరూ అక్కడి నుంచి చూస్తుండగానే ఆ వచ్చిన దుండగులు ఆ బస్సు మీద పెట్రోలు పోసి అగ్గి ముట్టించి వెళ్ళారు. క్రూరంగా అరుస్తూ, దూరంగా నిల్చొని ఆ బస్సు పూర్తిగా దగ్ధం కాగానే వాళ్ళందరూ తమ ఘనవిజయానికి ఆనందిస్తూ, వికృతంగా అరుచుకుంటూ వెళ్ళారు.



"మన కాపురం మా పల్లెలోనే పెడదామండీ! మా ఊళ్ళో చర్చి, మసీదు, గుడి - ఏవీ లేవు. ఉన్నదొక్క బడి మాత్రమే! అందులో మానవతా విలువల్ని బోధిస్తారు."

బస్సులోని వారంతా తలో దిక్కుకూ వెళ్ళడం వలన ఎవరెక్కడున్నదీ తెలియరాలేదు. తరువాత ఏం జరగబోతున్నదీ ఎవరికీ తెలియడం లేదు. అందరికీ ఆ స్థితిలో ప్రాణభయం తప్ప మరోటి లేదు. ఎక్కడున్నవాళ్ళు అక్కడే ఉన్నారు గానీ ఎవరూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయడానికి సాహసించడం లేదు. తమ కళ్ళ ముందే తమ సామానుతో పాటే దగ్ధమైన ఆ బస్సు వంకే దీనంగా చూస్తున్నారు. ఆ ప్రాంతాల్లో అటూ ఇటూ కొందరు వ్యక్తులు ఆ రోడ్డమ్మట వెళ్తూ, 'మసీదులో బాంబు పేలిందట. కర్ఫ్యూ పెట్టారట' అన్న మాటలు కొద్దికొద్దిగా వీళ్ళ చెవిన పడుతున్నాయ్. ఇవి వాళ్ళను మరింత అలజడికి లోను చేశాయి.

ఇలా రెండు గంటల కాలం గడిచిన తరువాత పోలీస్ జీప్ అటుగా వచ్చింది. అందులోంచి "మసీదులో బాంబు పేలింది. అంతటా ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉంది. ఈ ప్రాంతమంతా కర్ఫ్యూ అమలులో ఉంది. ప్రజలంతా అప్రమత్తులై ఉండి, సహనంగా ఉండాలని హెచ్చరించడమైనది" అన్న ఎనౌన్స్‌మెంట్ పదేపదే వినిపించసాగింది. దీంతో వాళ్ళందరూ ఒక్కసారిగా షాకైపోయారు. ఎక్కడివాళ్ళక్కడే కొన్ని గంటలు గడిపారు. తెలవారుతుండగా ఒక్కొక్కరూ ధైర్యాన్ని కూడగట్టుకుంటూ దగ్ధమైన బస్సు దగ్గరకు చేరారు. ఒకళ్ళను చూసుకొని ఒకళ్ళు బతికే ఉన్నందుకు సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పెళ్ళికుమార్తె పద్మ, పెళ్ళికుమారుడు శేఖర్‌ల జాడ మాత్రం తెలియరాలేదు. డ్రైవర్ కూడా అక్కడకు చేరుకున్నాడు. ముందుగా హెచ్చరికలు చేసి తమను కాపాడినందుకు అతన్ని అందరూ అభినందించారు. అందరూ తలో దిక్కూ వెళ్ళి, అక్కడక్కడా వాళ్ళను వెతికే ప్రయత్నం చేస్తున్నారు.

"పెళ్ళికుమార్తెను ఆ దుండగుల్లో ఎవడన్నా..." అనుమానం వెలిబుచ్చాడు పురోహితుడు.

"నాకూ అదే అనుమానంగా ఉంది." వంత పాడాడు పెళ్ళిపెద్ద.

"ఇంకా నయం, ఆ బాంబేదో మనం బస్సులో ఉన్నప్పుడు పడలేదు." పురోహితుడు తన భయాన్ని బయట పెట్టాడు.

"అలా జరిగుంటే మనం ఇలా మాట్లాడుకోవడానికి వీలుండేదా?" పెళ్ళిపెద్ద అదృష్టవంతులమన్నట్లుగా అన్నాడు.

"దేవుళ్ళకే సేఫ్టీ లేకుండాపోయింది. ఇక మనుషులకెక్కడుంటుందండీ సేఫ్టీ" అన్నాడు పురోహితుడు.

"ఇంకా దేవుళ్ళెక్కడున్నారండీ! మీదంతా పిచ్చి భ్రమ కాని. వాళ్ళెప్పుడో పారిపోయారు ఈ బాంబుల దెబ్బకు భయపడి. ఉంటే ఇలాంటివి జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటారా" అన్నాడు మళ్ళీ పెళ్ళిపెద్ద.

"చాల్ చాల్ ఆపండి. అన్నీ తెలిసినట్లే మాట్లాడుతున్నారు. అన్నీ ముందుగానే ఊహించి దంచేస్తున్నారు. ఆపండి! అసలే మావాళ్ళు రాక మేము ఇదవుతుంటే." విదిలించినట్లు అన్నారు రామారావుగారు, దేవుళ్ళను విమర్శిస్తే వాళ్ళకేం కోపమొస్తుందోనన్న భయంతో.

"మావాడన్నా క్షేమంగా తిరిగొస్తే బాగుణ్ణు. అసలీ పెళ్ళీ గిళ్ళీ వద్దు మొర్రో అంటూ మొదట్నుంచీ మొరపెట్టుకుంటూనే ఉన్నా! అడుగడుగునా అన్నీ అపశకునాలే! ఇప్పటివరకూ ఒక్కటి సవ్యంగా జరగలేదు. ఆ పెళ్ళి కూడా హడావిడి హడావిడిగా ఏదో తూతూ మంత్రంగా జరిగిపోయింది. ఓ అలకా లేదూ, ఓ మొలకా లేదూ." మరి కాస్త విసుక్కుంది జానకమ్మ మనసులో.

"మనం కూడా అలా వెతికొద్దాం పదండి" అని పురోహితుడు అంటుండగా పద్మను తీసుకొని శేఖర్ అక్కడికి వచ్చాడు. మిగతా వాళ్ళంతా వాళ్ళ వెనుకనే వచ్చేశారు.

"నాయనా శేఖర్ వచ్చావా" అంటూ రామారావుగారు సంతృప్తి చెందారు.

"పద్మా" అంటూ ఆమె అన్నా వదినెలు పెళ్ళికూతురును దగ్గరకు తీసుకున్నారు.

ఒక పర్యాయం అందరూ చేరారా, లేదా అని సరిచూసుకున్న తరువాత, కర్ఫ్యూ ఎప్పుడు సడలిస్తారా అని బెదురు బెదురుగా ఎదురు చూడసాగారు. శేఖర్, పద్మలు వాళ్ళకు కాస్త దూరంలో రోడ్డు మీదుగా నిల్చొని ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ, ఒకరి భావాల్ని మరొకరు అర్థం చేసుకుంటూ మాటల్లోకి దిగారు.

శేఖర్ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ, "ఏమండీ! ఒక్క మాట చెబుతాను ఏమీ అనుకోరు కదా" అంది పద్మ.

"చెప్పు పద్మా" అన్నాడు శేఖర్.

"మన కాపురం మా పల్లెలోనే పెడదామండీ!"

"ఎందుకు పద్మా! మా వాళ్ళు నీకు నచ్చలేదా?"

"మీరు నావారైనప్పుడు మీ వాళ్ళంతా నావాళ్ళు కాదా?"

"మరి!"

"మా ఊళ్ళో చర్చి కానీ, మసీదు కానీ, గుడి కానీ ఏవీ లేవు. ఉన్నదొక్క బడి మాత్రమే! అందులో మానవతా విలువల్ని బోధిస్తారు. మనిషినే దైవంగా భావిస్తారు. సంకుచితత్వాలు, సంకోచాలు లేవు. డబ్బుకు విలువ ఇవ్వరు. వృత్తికే విలువ. మనసున్న మనుషులుగా ఒకర్నొకరు అభిమానించుకొంటూ, ఆరాధించుకొంటూ జీవిస్తారు. అందుకే మా ఊళ్ళోనే మన కాపురం. కాదనకండి" అంటున్న పద్మ కళ్ళలోని వెలుగును చూసి ఆశ్చర్యపోయాడు శేఖర్. ■